
ప్రజాశక్తి
గురువారం 14 డిసెంబర్ 2023 5
పార్వతీపురం మన్యం



టీవీ యాంకర్ సతీష్‌కు పురస్కారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రముఖ యాంకర్, టెన్ టీవీ అసిస్టెంట్ ఎడిటర్ తాడ్డి సతీష్‌కు రాష్ట్ర ప్రభుత్వం తెలుగు గళా పురస్కారాన్ని ప్రకటించింది.. మౌలిక భాషా పరంగా తెలుగుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఈ అవార్డును ప్రకటించాయి. విజయవాడలో ఈ నెల 15న సతీష్‌ను అవార్డుతో సత్కరిస్తారు. పార్వతీపురం పట్టణానికి చెందిన సతీష్ 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక నంది అవార్డు, అమెరికాకు చెందిన హై రేంజ్, నేషనల్ టెలివిజన్ అవార్డులతోపాటు 27కు పైగా అవార్డులను సొంతం చేసుకున్నారు. ఆయన తండ్రి అప్పలస్వామి రిటైర్డ్ టీచర్, రచయిత. సతీష్‌కు అవార్డు రావడంపై పట్టణానికి చెందిన ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

తాడోపేడో తేల్చుకుంటాం



సాలూరు.. అంగన్వాడీల సమ్మె శిబిరంలో పాల్గొని మద్దతు తెలియజేస్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి

- ప్రభుత్వ బెదిరింపులకు లొంగేది లేదు
- తేల్చిచెప్పిన అంగన్వాడీలు
- రెండో రోజుకు సమ్మె
- టిడిపి, జనసేన, ప్రజా సంఘాల నాయకుల మద్దతు

సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ బెదిరింపులకు తలొగ్గబోమని, తాడో పేడో తేల్చుకుంటామని తెగేసి చెప్పారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

అంగన్వాడీల సమ్మెలో భాగంగా రెండో రోజు బుధవారం పార్వతీపురం పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు కొనసాగాయి. ఈ ప్రభుత్వానికి మనసు మారాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి జ్ఞానోదయం కలగాలని కార్తీక మాసం చివరిరోజు పోలి పాడ్యమి సందర్భంగా దీపాలను వెలిగించి, వినూత్న రీతిలో నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోగి మాట్లాడుతూ అంగన్వాడీలపై ప్రభుత్వం బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. అంగన్వాడీల సమ్మెకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర మద్దతు తెలిపారు. అంగన్వాడీలతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న జగన్ ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరించాలంటే కక్షగట్టి వేధిస్తోందని ధ్వజమెత్తారు. అంగన్వాడీల న్యాయమైన పోరాటానికి టిడిపి సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. సమ్మెకు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మురళీమోహన్ , గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పి.రంజిత్ కుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు మద్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, శాంతి,తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యాన రెండో రోజు నిరసన దీక్ష కొనసాగింది. తహశీల్దార్ కార్యాలయం వద్ద నుంచి పంచాయతీ కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ చేపట్టారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, ఆర్.ఈశ్వరరావు, వై.రామారావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శైలజ, సునీత, సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు

కురుపాం : కురుపాంలో అంగన్వాడీల సమ్మె శిబిరానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.సీతారాం, వి.తిరుపతిరావు, టిడిపి నాయకులు గురాన శ్రీరామ్మూర్తి, రొబ్బ లోవరాజు, సుకేష్ చంద్ర పండ, యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళా కుమారి, జిల్లా కార్యదర్శి కె.సరోజ పాల్గొన్నారు.

పాచిపెంట : ఐసిడిఎస్ కార్యాలయం వద్ద రెండో రోజు అంగన్వాడీలు నిరసన దీక్ష చేపట్టారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.ప్రభావతి, ఎం.బంగారమ్మ, రమాదేవి, సుగుణమ్మ పాల్గొన్నారు.



పార్వతీపురం.. ప్రభుత్వ మనసు మారాలని వినూత్నరీతిలో దీపాలను వెలిగిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మక్కువ : మక్కువలో అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని టిడిపి సీనియర్ నాయకులు మామిడి ప్రసాద్‌నాయుడు సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పి.మల్లేశ్వరరావు, రామాథియేటర్ ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ శిబిరాన్ని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పట్టణ నాయకులు బి.అశోక్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు పట్టణ అధ్యక్షులు బి.రాధ, కార్యదర్శి వరలక్ష్మి, మండల కమిటీ అధ్యక్షులు ఎ.నారాయణమ్మ, కార్యదర్శి శశికళ, నాయకులు శ్యామల, తిరుపతమ్మ, పార్వతి, అరుణ పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల బయట అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె శిబిరాన్ని టిడిపి, జనసేన, ఎపిటిఎఫ్ నాయకులు సందర్శించి, మద్దతు తెలియజేశారు. ఎపిటిఎఫ్ నాయకులు ధనంజయ నాయుడు,. టిడిపి నాయకులు వేణు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో రెండో రోజు చేపట్టిన అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ సందర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కస్తూరి, సత్యవతి పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో ర్యాలీ చేపడుతున్న అంగన్వాడీలు



గుమ్మలక్ష్మీపురంలో దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు



సీతానగరం.. గాంధీ విగ్రహానికి వినతి అందిస్తున్న అంగన్వాడీలు



వంతెన పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

టిడిపి ఘారిటీలు ఉత్తివే

- రైతులను మోసం చేసిన బాబుని నమ్మొద్దు
- సచివాలయం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

గ్యారెంటీ లేని టిడిపి ఘారిటీలు ఉత్తుత్తివేనని డిప్యూటీ సిఎం రాజన్నదొర కొట్టిపారేశారు. రైతులను మోసం చేసిన టిడిపి అధినేత చంద్రబాబును నమ్మొద్దని కోరారు. బుధవారం మండలంలో రూ.35 లక్షలతో నిర్మించిన సారిక సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రాష్ట్రానికి ఎందుకు జగనే కావాలి కార్యక్రమంలో భాగంగా వైసిపి జెండాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ హయాంలో నిర్మించిన పంచాయతీ భవనాలు ఇప్పుడు శిథిలావస్థలో ఉన్నాయని చెప్పారు. రైతులు, మహిళలను మోసం చేసిన చంద్రబాబుని ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. రుణమాఫీ చేస్తామని చెప్పి నిలువునా మోసం చేసిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనని విమర్శించారు. కొటియా గ్రామాల విషయంలో ఎపి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం లేదని చెప్పారు. ఒడిశాతో ఉన్న జలవివాదాల కారణంగా కొంత సంయమనంతో వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. సచివాలయ పరిధిలో రూ.15 కోట్ల సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. 8 కోట్లతో దిగువ శెంబి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. 3.87 కోట్లతో సొంపిగాం వంతెన నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. మామిడిపల్లి, తోణాం రోడ్లను టిడిపి ప్రభుత్వ హయాంలో ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించాలని ప్రజలను కోరారు. నియోజకవర్గంలో దశలవారీగా రోడ్లు, వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. టిడిపి నాయకులు చెప్పే మాటలు నమ్మవద్దని కోరారు. వైసిపి మళ్ళీ అధికారంలోకి రాకపోతే దళితులు, గిరిజనులే నష్టపోతారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సర్పంచ్ గొర్లి సత్యవతి, కోఆప్షన్ ఎంపిటిసి సభ్యులు సువార్తరావు, పిఆర్ ఇఇ ఎంవిఆర్ కృష్ణాజీ, పిఆర్ డిఇ చిన్నం నాయుడు, ఎంపిడిఒ జి.పార్వతి పాల్గొన్నారు.

వంతెన పనులు పరిశీలన

సారిక పంచాయతీ సొంపిగాం సమీపంలో స్వర్ణముఖి నదిపై నిర్మించనున్న వంతెన పనులను డిప్యూటీ సిఎం రాజన్నదొర పరిశీలించారు. 3.87 కోట్లతో నిర్మించనున్న వంతెన పూర్తయితే సొంపిగాం గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరిపోయే అవకాశం ఉంది. వంతెన నిర్మాణానికి నది సమీపంలో నిల్వ చేసిన నిర్మాణ సామగ్రి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో కాంట్రాక్టరు పనులను కొంత జాప్యం చేశారు. బుధవారం సారిక సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన రాజన్నదొర సొంపిగాం వంతెన నిర్మాణం గురించి పిఆర్ ఇఇ ఎంవిఆర్ కృష్ణాజీ, డిఇ శర్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సువ్వాడ రామకృష్ణ ఉన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

పాచిపెంట గ్రామానికి చెందిన 30 దళిత కుటుంబాలు బుధవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర సమక్షంలో వైసిపిలో చేరాయి. వైసిపి జిల్లా కార్యదర్శి డోల బాబ్జీ, సాలూరు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ఆధ్వర్యాన యజ్జల చిన గోవిందరావు నాయకత్వంలో టిడిపి నుంచి వైసిపిలో చేరారు. వారికి రాజన్నదొర పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆయన కోరారు.

విద్యారంగ సమస్యలపై చర్చలు సఫలం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్



చర్చల్లో పాల్గొన్న అధికారులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం మన్యం జిల్లా విద్యారంగ సమస్యలపైన జిల్లా విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన అక్టోబర్‌లో చేపట్టిన సైకిల్ యాత్ర సందర్భంగా విద్యార్థుల, స్థానిక సమస్యలను గుర్తించారు. వీటిపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులతో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ కేశవ నాయుడు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి జిల్లా డిప్యూటీ డైరెక్టర్లతో చర్చలు నిర్వహించారు. సుమారుగా గంటపాటు చర్చలు జరిగాయి. అనంతరం డిఆర్ఒ కేశవనాయుడు మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. దానికి సంబంధించిన శాఖలన్నింటికీ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. ఆర్థిక పరంగా, రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను ఆయా రాష్ట్ర శాఖలకు లేఖల ద్వారా తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కార దిశగా అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు, శివ, మాలతి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీలో శానిటేషన్ సెక్రటరీ అశోక్‌పై భౌతిక దాడిని ఖండిస్తూ యూనియన్ అధ్యక్షులు ఎస్ఎఫ్ అహ్మద్ ఆధ్వర్యాన ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు.

విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దాడి చేయడం అమానుషమని అధ్యక్షులు అహ్మద్ ఖండించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పనిభారం తగ్గించాల్సిందే

నేడు, రేపు కలెక్టరేట్ ఎదుట 'ఆశా'ల వంటావార్పు ● 36 గంటలపాటు నిరవధిక ధర్నాకు పిలుపు


ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వెట్టిచాకిరీ చేయించుకుంటున్న 'ఆశా'లకు పనిభారం తగ్గించి వేతనం పెంచాలని ఈ నెల 14, 15వ తేదీల్లో కలెక్టరేట్ ఎదుట వంటావార్పుతో నిరవధిక ధర్నాకు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. ఈ మేరకు జిల్లాలోని ఆశావర్కర్లంతా నిరవధిక ధర్నాకు కదులుతున్నారు. ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి, ఆయా పిహెచ్ సి, అర్బన్ హెల్త్ సెంటర్ అధికారులకు ఆశా వర్కర్లు వినతి పత్రాలు ఇచ్చి ధర్నాకు వెళ్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 1679 మంది ఆశా వర్కర్లు, 1500 సిహెచ్‌డబ్ల్యుఒలు పనిచేస్తున్నారు. వీరంతా రెండు రోజులపాటు చేపట్టే 36 గంటల ధర్నాలో పాల్గొననున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశాలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు కోరడంతోపాటు 36 గంటల ధర్నాకు కలెక్టరేట్ ఎదుట ఏర్పాట్లు చేస్తున్నారు. వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించడంలో, కనీస వేతనాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కారం కోసం జరిగే పోరాటానికి ఆశా వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇప్పటికే యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు.



వైద్యులతో కలిసి ఫీవర్ సర్వే చేస్తున్న ఆశా వర్కర్ (ఫైల్)

ఉద్యోగ భద్రత కల్పించాలి



అనేక ఏళ్లుగా ఆశా వర్కర్లు గా పని చేస్తున్న మాకు సరైన గుర్తింపు లేదు. ఉద్యోగ భద్రత కరువైంది. అన్ని రకాల పనులు మాతో చేయించుకుంటున్న ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుంది. ఆశా వర్కర్లు కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలి.

- ఎం.శివాని, ఆశా వర్కర్ల యూనియన్ పార్వతీపురం పిపి యూనిట్ అధ్యక్షులు

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం



ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని గురు, శుక్రవారాల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరవధిక ధర్నా, వంటావార్పు కార్యక్రమాలు చేస్తున్నాం. ఆశావర్కర్లకు పని భారం పెరగడం వల్ల అనేకమంది హార్ట్ ఎటాక్ వచ్చి అనారోగ్యం పాలై చనిపోతున్నారు. వీరికి గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని యూనియన్‌గా అనేకమార్లు ధర్నాలు చేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు, అందుకే 36 గంటల పాటు ధర్నా చేయాలని నిర్ణయించాం.

- వి.ఇందిర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

ఇవీ డిమాండ్లు

- కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్చాలి.
- పనిభారం తగ్గించాలి. ఆన్లైన్, రికార్డు పని ఒకే సారి చేయించాలి.
- రూ.10లక్షల గ్రూప్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలి.
- ప్రభుత్వ సెలవులు, మెడికల్, మెటర్నిటీ లీవ్ ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఇళ్ల స్థలం, ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.
- మరణించిన వారి కుటుంబంలో అర్హులైన వారికి ఆశాలుగా తీసుకోవాలి.
- కనీస వేతనం చెల్లించాలి. ఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలి.

ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలేవి?

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు సకాలంలో సక్రమంగా నిర్వహించడం లేదని టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాలకవర్గ సమావేశాలు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల గిరిజనాభివృద్ధి కుంటుపడుతుందన్నారు. మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన సమావేశాలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఉన్నప్పటికీ ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు అధికారులు సకాలంలో నిర్వహించకపోవడం తీవ్ర విచారకరమన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని పాపమ్మవలస ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ మండలంలోని ఇప్పటివరకు 2556 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఆ రైతుల బ్యాంకు ఖాతాల్లో 48 గంటల్లో డబ్బులు జమవుతున్నట్లు చెప్పారు. 30 ట్రాక్టర్లకు జిపిఎస్ ఏర్పాటుచేసి, రైతులకు అందుబాటులో ఉంచామని ఐటిడిఎ పిఒ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రాకేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-సీతానగరం

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. బుధవారం మండలంలోని చినబోగిలి గ్రామంలో జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీరాములనాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, సర్పంచ్ కూర్మాన రాధా శ్రీనివాస్, ఎంపిటిసి బుజ్జి, మహిళా అధ్యక్షులు దాసరి నాగరత్నం పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఎంఒ జాషువా, జగన్మోహనరావు

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని ఎంఆర్ నగరంలో డబ్ల్యుహెచ్ఒ ఎస్ఎంఒ డాక్టర్ జాన్ జూడ్ జాషువా, జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకా కేంద్రంలో రికార్డులు, టీకా కార్డులు, వ్యాక్సిన్, అత్యవసర మందుల కిట్ పరిశీలించారు. టీకా మార్గదర్శకాలను ఏ మేరకు అమలు చేస్తున్నారో చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలించారు. టీకా వేసిన పిల్లల వివరాలు, వారి వయస్సు పరిశీలించి, యువిన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమాన్ని శనివారం వరకు కొనసాగించాలని సూచించారు. ఇంకా టీకా వేయాల్సిన పిల్లలు, గర్భిణులకు టీకా వేసి ఇవ్వబడిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ వెంకటనాయుడు, ఎఎన్ఎం పోలమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి సాగు పద్ధతిలో పండించిన పంటలను పరిశీలిస్తున్న అనూప్, పారినాయుడు

ప్రకృతి వ్యవసాయం.. పరిపూర్ణం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జట్టు ట్రస్ట్ ద్వారా ప్రకృతి వ్యవసాయ సాగు పరిపూర్ణంగా అమలవుతున్నట్లు జట్టు ట్రస్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల చేపడుతున్న విలువ హెచ్చింపు, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్ తయారీని సిఫ్- రైతు సాధికార సంస్థ అధ్యయనకర్త అనూప్‌కుమార్‌కు ఆయన వివరించారు. అనంతరం బయో రిసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. గొరడ, రాయగడ జమ్ము గ్రామాల రైతులు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటల సాగును పరిశీలించారు. రైతులు జీవామృతాలు స్వయంగా తయారు చేసుకుని ఉపయోగించడం చూసిన అనూప్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొలం బడికి గేయాల అనువాదకులు పూజిత, జట్టు ట్రస్ట్ కోడైరెక్టర్ నూకంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

ప్రజాశక్తి-సీతానగరం

ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆర్‌డిఒ కె.హేమలత బిఎల్ఒలను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ జాబితాలో 6, 7, 8 ఫారాలను సరిచేసుకొని, ఎక్కడా తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ ఎంవి రమణ, బిఎల్ఒలు పాల్గొన్నారు.

బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చ

ప్రజాశక్తి, విజయనగరం కోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా భోగాపురం మండలం పోలిపల్లి లో ఈనెల 20న నిర్వహించే భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని రాష్ట్ర పార్టీ పరిశీలకులు అమర్నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అధ్యక్షతన నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సమావేశం జరిగింది. సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు, కోండ్రు మురళీమోహన్, అదితి గజపతి రాజు , కర్రోతు బంగార్రాజు , మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు , రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ , జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి. రాజు , పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

14 నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, విజయనగరం మువ్వల లక్ష్మణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, జిల్లా కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. 'విద్యుత్ పొదుపు ఆవశ్యకత మరియు నూతన సాంకేతిక విజ్ఞానం' అంశంపై నిష్ణాతులచే ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

అక్రమ వసూళ్లు అన్యాయం

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఉద్యోగాలు కోసం నిరుద్యోగుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడడం అన్యాయమని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. మున్సిపాలిటీలో కాంట్రాక్టు ఉద్యోగాలు కోసం అధికార పార్టీకి చెందిన కొంతమంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఒకొక్క ఉద్యోగానికి రూ.6లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి అక్రమ వసూళ్లను ఆపాలని, ఏసెక్షన్‌లో ఉద్యోగులను నూతనంగా నియమిస్తున్నారు, ఏ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యా సామర్థ్యంపై డిప్యూటీ డిఇఒ ఆరా

రేగిడి: మండలంలోని వెంకట రంగారాయపురం, కొత్త చలికాని వలస పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా సామర్థ్యంపై ఉపవిద్యాశాఖాధికారి బ్రహ్మాజీ బుధవారం ఆరా తీశారు. విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనపై ఉపాధ్యాయ పాత్రను పోషించి పాఠాలు బోధించారు. తరగతుల వారి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలను, లెసన్ ప్లాన్లను, విద్యార్థుల వర్కు బుక్కులను క్షుణ్ణంగా పరిశీలించారు.

శ్రీకాకుళం టు హైదరాబాద్

ఒకే లారీలో 54 ఆవులు తరలింపు

●వాహనాల తనిఖీలో పట్టుబడిన లారీ ●గోశాలకు తరలిస్తుండగా లారీలో మంటలు ●క్షేమంగా మరో లారీలో ఎక్కించిన పోలీసులు

ప్రజాశక్తి - భోగాపురం

ఒకే లారీలో సుమారు 50కి పైగా ఆవులను ఎక్కించి శ్రీకాకుళం నుంచి హైదరాబాదుకు తరలిస్తున్నారు. ఇంతలో భోగాపురం సి.ఐ బీవి వెంకటేశ్వరరావు మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ లారీ పట్టుబడింది. ఈ లారీని విశాఖ పట్నంలోని పెందుర్తి వద్దనున్న గోశాలకు బుధవారం తరలిస్తుండగా సుందరపేట జంక్షను వద్దకు వచ్చేసరికి లారీలో మంటలు చెలరేగడంతో వెంటనే నిలుపదల చేసి మంటలను ఆర్పి మరో వాహనంలో ఎక్కిస్తుండగా అందులో ఉన్న ఆవుల సంఖ్యను చూస్తే అక్కడ ఉన్నవారికి మతిపోయింది. ఒకటి కాదు రెండు కాదు రెండు వరుసల్లో ఒకదానిపై ఒకటి ఎక్కించి 54 ఆవులను ఒకే లారీలో తరలించే ప్రయత్నం చేశారు.

శ్రీకాకుళం జిల్లాల్లో వివిధ సంతల్లో కొంతమంది వ్యాపారులు ఆవులను కొనుగోలు చేశారు. ఇలా సుమారు


పట్టుబడిన లారీ

50కి పైగా ఆవులను హైదరాబాదు తరలించేందుకు లారీలో ఎక్కించారు. వీటిని మంగళ వారం రాత్రి తరలిస్తున్నారు. ఇంతలో పూసపాటిరేగ మండలం అగ్రహారం వద్ద భోగాపురం సి.ఐ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ లారీ పట్టుబడింది.

గోశాలకు తరలిస్తుండగా లారీలో మంటలు

పట్టుబడిన ఆవులను పెందుర్తి వద్దనున్న గోశాలకు పోలీసులు తరలిస్తుండగా సుందరపేట జంక్షను సమీపంలో లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చెలరేగిన మంటలను వెంటనే ఆర్పివేశారు. ఈ ఆవులను మరో లారీని తీసుకువచ్చి అందులోకి ఎక్కించారు. అప్పుడు లారీ డోర్‌ను ఓపెన్ చేసి చూసిన పోలీసులు అవాక్కయ్యారు. ఒకేలారీలో రెండు వరసల్లో ఒక ఆవుపై మరో ఆవును ఎక్కించి నిర్వాహకులు తరలిస్తున్న తీరు కనిపించింది. ఇలా ఒకదానిపై ఒకటి లోపికి కుక్కేయడం వల్ల కొన్ని ఆవులు కూడా లారీలోనే చనిపోయినట్లు తెలుస్తోంది.

కేసు నమోదు: సిఐ

వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆవులను తరలిస్తున్న లారీ పట్టుబడింది. ఆవులను తరలిస్తున్న వారితో పాటు కొనుగోలు చేసిన వ్యాపారిపై కేసులు నమోదు చేయమని పూసపాటిరేగ ఎస్ఐకి చెప్పాం. ఆవులను అనుమతులు ఉన్న గోశాలకు పంపించమని ఆదేశించామని సిఐ బివి వెంకటేశ్వరరావు తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం కోట : డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్స్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. బుధవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ నైపుణ్య కేంద్రంలో రెండు నెలల శిక్షణకు దరఖాస్తులు కోరుచున్నట్లు తెలిపారు. అభ్యర్థుల వయసు 18 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్య అర్హత ధ్రువపత్రాలతో పాటుగా ఆధార్ కార్డు, రెండు ఫోటోలతో ఈనెల 16వ తేదీ లోపు https//forms.gle/ vKUYDK j9Dz yaHY2T అనే లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7780658035 నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

బొత్సను కలిసిన కోలగట్ల

విజయనగరం టౌన్ : ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకొని పూర్తిగా కోలుకొని విజయవాడ చేరుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.


రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి


పెద్దబుడ్డిడిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

మిచౌంగ్ తుపాను కారణంగా వరి, పత్తి పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి డిమాండ్ చేశారు. మండలంలో ఉదయపురం పంచాయతీలో ముంపునకు గురైన వరి, పత్తి పంటలను బుధవారం టిడిపి నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుపాను రూపంలో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపునీటిలో తడిసిన ధాన్యం మొలకలు వస్తాయని, పత్తి పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులు, కౌలురైతులు పెట్టిన పెట్టుబడి రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు అరకు పార్లమెంట్ అధ్యక్షులు దేవకోట వెంకట నాయుడు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి, నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేష్ బాబు, ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, ట్రైబల్ రైట్స్ ఫోరం అధ్యక్షులు రొబ్బ లోవరాజు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలంలోని చినకుదమ, పెద్ద బుడ్డిడి గ్రామాల్లో వర్షాలతో నష్టం వాటిల్లిన వరి, పత్తి పంటలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి రైతుల కష్టాలను కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి, ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, నాయకులు దేవకోట వెంకటనాయుడు, రొబ్బ లోవరాజు, రేవళ్ల సీతారాం నాయుడు, కర్రి మన్మథరావు, కర్రి సత్యాలు, పొగరి రమేష్, రాజనాల రాజు, పాండు రంగారావు పాల్గొన్నారు.


డిప్యూటీ సిఎంకు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

సిఎం హామీలు అమలు చేయాలి

డిప్యూటీ సిఎంకు మున్సిపల్ కార్మికుల వినతి

ప్రజాశక్తి-సాలూరు

పాదయాత్ర సందర్భంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు డిప్యూటీ సిఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆయన నివాసంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యాన కార్మికులు రాజన్నదొరని కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని సిఎం సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని చెప్పారు. రాష్ట్రంలోని 12 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేస్తోందని, వారిలో ఒక్క మున్సిపల్ కార్మికుడూ లేరని వాపోయారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని హామీనిచ్చినట్లు గుర్తుచేశారు. ఈ నెల 20 తర్వాత ఏం క్షణాన్నైనా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. దీనిపై డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు టి.ఇందు, టి.శంకరరావు పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నూరుశాతం ఫలితాలు లక్ష్యంగా పనిచేయాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. పదో తరగతి పరీక్షల సన్నాహాలపై గిరిమిత్ర సమావేశ మందిరంలో బుధవారం అకడమిక్ మానిటరింగ్ అధికారులు, ఎటిడబ్ల్యుఒలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నారు. శత శాతం లక్ష్యంగా పనిచేయాలని, ఇందుకు 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సబ్జెక్టు వారీగా రిసోర్స్ పర్సన్లు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ప్రతి ఉపాధ్యాయునికి, విద్యార్థికి కార్యాచరణ ప్రణాళిక తెలియాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట : మండలంలో దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటిడిఎ ఎపిఒ వై.రోషిరెడ్డి బుధవారం తనిఖీ చేపట్టారు. విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులతో


సీతంపేట.. ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎపిఒ రోషిరెడ్డి

విద్యాబోధనపై చర్చించారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ ఏడాది సత్ఫలితాలు సాధించాలన్నారు. భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో వివిధ అవసరాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఎపిఒ వెంట ప్రధానోపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు, ఉపాధ్యాయులు గణపతిరావు, విజయేంద్రరావు, నారాయణరావు, వెంకటరమణ, వెంకట్రావు, ఉత్తరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి-కురుపాం

గ్రీన్ అంబాసిడర్ల బకాయిల జీతం వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు ఎం.శ్రీనివాసరావు వి. తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లతో కలిసి నిరసన తెలియజేశారు. అనంతరం ఎంపిడిఒ జి.రమేష్‌బాబుకు గ్రీన్ అంబాసిడర్ల జీతాలు, సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలంటే గ్రీన్ అంబాసిడర్లే ఆధారమని తెలిపారు. వారికి ఎన్నో నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఉండడం సమంజసం కాదన్నారు. గ్రీన్ అంబాసిడర్ల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రీన్ అంబాసిడర్ల బకాయిల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు.


ఎంపిడిఒ రమేష్ బాబుకు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

పట్టణంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణంలోని 11వ వార్డు ఇందిరా కాలనీలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో బుధవారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనాలోచిత విధానాల వల్ల ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు జి.రవికుమార్, బోను చంద్రమౌళి, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు , సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, పోల సత్యనారాయణ, పాలకొండ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర

బాధిత కుటుంబానికి టిడిపి పరామర్శ

నరసిపురం గ్రామంలో మంగళవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మాచర్ల శ్రీరామ్ కుటుంబాన్ని బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర, మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరీ వెంకట రమణ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు బోను చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి పాల్గొన్నారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాల గ్రౌండ్స్‌లో కోచ్ కె. సంతోష్ అధ్వర్యంలోలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇటీవల విశాఖపట్నం లో జరిగిన జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ మేయర్ కప్ - 2023 లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. వాటిలో ఎస్.శ్రీకాంత్, పి.హేమంత్ కాటా- కుంటీ లో బంగారు పతకాలు, బి.యోచన కాటాలో బంగారు పతకం, కుంటీలో రజిత పతకం, ఎం. హర్ష వర్ధన్, కాటా లో బంగారు పతకం, కుంటీ లో కాంస్య పతకం, కె.శివ గణేష్, కాటాలో బంగారు పతకం, కుంటీలో కాంస్య పతకం, బి.హస్వంత్, కాటాలో రజిత పతకం, కుంటీలో రజిత పతకం, జి. తిరుమల రజిత పతకం సాధించారు. వీరంతా ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతులు మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరిని సత్య డిగ్రీ కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం. సత్య వేణి, జిల్లా కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సంతోష్ విద్యార్థులను అభినందించారు.

కిటకిటలాడిన తోటపల్లి దేవస్థానం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పోలిపాడ్యమి సందర్భంగా మండలంలో తోటపల్లి దేవస్థానం బుధవారం కిటకిటలాడింది. యాత్రికులు భారీగా తరలివచ్చారు. స్వామివారి పల్లకిని నాగావళి నదీ తీరానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు వి.వి.అప్పలాచార్యులు ఆధ్వర్యాన నదీ హారతి ఇచ్చారు. పొడుగు సంజీవరావు, కల్యాణి సహకారంతో ప్రసాద వితరణ చేశారు. ట్రెయినీ డిఎస్‌పి అజీజ్ ఆధ్వర్యంలో చినమేరంగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ కళాధర్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఇఒ వి.వి సూర్యనారాయణ యాత్రికులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, సభ్యులు గౌరీశంకర్ పాత్రో, గంటేడ సింహాచలం నాయుడు, కుసుమూరు సాగర్, తదితరులు పాల్గొన్నారు.


నాగావళి తీరంలో యాత్రికులు

నేరాలు ఘోరాలు

పశువుల మందను ఢీకొన్న లారీ

నాలుగు ఆవులు మృతి

ప్రజాశక్తి-సీతంపేట

కె.గుమ్మడి గ్రామం వద్ద పశువుల మందను లారీ ఢీకొంది. ఈ ఘటనలో నాలుగు ఆవులు మృతిచెందాయి. కాపరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది.

హంసకుడుము నుండి పశువుల మందను కాపరి కొత్త వరదయ్య మంగళవారం రాత్రి తోలుకొని వస్తున్నాడు. మండలంలో సీతంపేట వైపు నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపటం వల్ల కె.గుమ్మడి వద్ద ఆవుల మందను లారీ ఢీకొంది. దీంతో నాలుగు ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. రెండు ఆవులకు గాయాలయ్యాయి పశువుల కాపరి వరదయ్య గాయపడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీష్ నాయుడు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎస్ఇబి సిబ్బంది

సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ముందస్తు సమాచారం మేరకు ఎస్ఇబి సిబ్బంది బుధవారం నాటు సారా స్థావరాలపై దాడులను నిర్వహించారు. 1100 లీటర్ల పులిసిన బెల్లం ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కురుపాం ఎస్ఐబి ఎస్ఐ బివి నాగభూషణరావు మాట్లాడుతూ మండలంలో పొడి పంచాయతీలోని బూర్జి మానుగూడ గ్రామానికి చెందిన కూరంగి బుడ్డయ్య, పొడి గ్రామానికి చెందిన ఆరిక సుగ్రీవులు పరారైనట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ ఎం.రవిప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ రాయుడు పాల్గొన్నారు.

పది లీటర్లు సారా పట్టివేత

సీతంపేట : మండలంలో దోనుబాయి జంక్షన్ వద్ద 10 లీటర్ల నాటుసారాను పాలకొండకు చెందిన వ్యక్తి తెస్తుండగా సీతంపేట ఎస్ఐ ఎం.జగదీష్ నాయుడు పట్టుకొన్నారు. ఆయనపై కేసు నమోదు చేశారు.